
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం, 26, ఆగస్టు, 2023



చీనీ టన్ను రూ.17,500
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.17,500 పలికాయి. మార్కెట్‌కు 569 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20
కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.20 పలికింది. కనిష్టంగా రూ.6.50, సరాసరిన రూ.13 చొప్పున క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
36.2°/21.9°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

ఓనం వేడుకలకు ప్రశాంతి నిలయం ముస్తాబు



సత్యసాయి మహాసమాధి(ఫైల్)

ప్రశాంతి నిలయం: కేరళీయుల ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఓనం వేడుకలకు ప్రశాంతి నిలయం ముస్తాబవుతోంది. ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు సత్యసాయి సన్నిధిలో ఓనం వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. సత్యసాయి మహాసమాధిని, సాయికుల్వంత్ సభా మందిరాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. వేడుకల్లో భాగంగా ఈనెల 27న జరిగే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేరళ గవర్నర్ శ్రీధరన్ పిళ్లై పాల్గొని సత్యసాయి భక్తులను ద్దేశించి ప్రసంగించనున్నారు. అదే రోజు అర్జున్ సతీష్ నాయక్, సాయి పార్వతి సంగీత కచేరీ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఇక 28న నిర్వహించే కార్యక్రమాల్లో కేరళ రాష్ట్ర అడిషనల్ చీఫ్ సెక్రెటరీ జ్యోతిలాల్, ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ జయకుమార్ (ఐఏఎస్) పాల్గొంటారని, 29న కేరళ రాష్ట్ర సత్యసాయి భక్తు ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. వేడుకల్లో పాల్గొనేందుకు ఇప్పటికే కేరళ రాష్ట్ర సత్యసాయి భక్తులు పెద్ద ఎత్తున పుట్టపర్తికి తరలివచ్చారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధంగా ఉండాలి

- మల్లాపల్లి జగనన్న కాలనీని సందర్శించిన కలెక్టర్ అరుణ్‌బాబు



జగనన్న కాలనీలో మౌలిక వసతులు పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

గోరంట్ల: 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమం కింద నిర్మించిన ఇళ్లకు సంబంధించి ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని, జిల్లా అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సామూహిక గృహ ప్రవేశాలకు ఎంపిక చేసిన మండల పరిధిలోని మల్లాపల్లి సమీపంలోని జగనన్న కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇళ్ల నిర్మాణ పురోగతిపై హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. అనంతరం కాలనీలో వీధిలైట్లు, రోడ్ల ఏర్పాటు, ఆర్చ్ నిర్మాణ పనులను, ఉపాధిహామీ నిధులతో ఇళ్లముందు తవ్విన ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈనెల 30న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కాలనీని వర్చువల్‌గా ప్రారంభిస్తారన్నారు. ఆలోపు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలన్నారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, హౌసింగ్ పీడీ చంద్రమౌళిరెడ్డి, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథ్ గుప్త, సచివాలయ ఉద్యోగులు, డ్వామా ఏపీడీ శివానంద నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఓపెన్' ప్రవేశాలకు ప్రత్యేక డ్రైవ్



ఓపెన్ స్కూల్ అడ్మిషన్స్ పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: 'ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్' ప్రవేశాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ లాజర్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక ఎంఈఓ గంగప్పతో కలిసి ఎంజీఎం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు సంబంధించిన సాంకేతిక అంశాలు వివరించారు. ఆన్‌లైన్ అప్లికేషన్ విధానంపై అవగాహన కల్పించారు. 10వ తరగతిలో ఫెయిల్ అయిన, ఇతర కారణాలతో చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా మళ్లీ చదువుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. దరఖాస్తుకు సెప్టెంబర్ 5 వరకూ అవకాశం ఉందన్నారు. అనంతరం ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంజీఎం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రమణ, కోఆర్డినేటర్ సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పురంలో జెండా ఎగరేద్దాం

- రాష్ట్రమంతా జగన్ కంచుకోటనే
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- 'పురం'లో వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యేలు శంకరనారాయణ, సిద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్, మధుమతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు

హిందూపురం: ''వైఎస్సార్ సీపీలో వర్గాలు లేవు. నాయకుడు...కార్యకర్త తేడా లేదు. అందరూ ఒక్కటే. అందరి లక్ష్యం ఒక్కటే. ప్రతిచోటా వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయడం... జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేయడం. ఇందుకు ప్రతి ఒక్కరూ కష్టపడాలి. ఒక్కటై నిలిచి గెలిచితీరాలి''అని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పోలీసు క్వార్టర్స్ సమీపంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయాన్ని శుక్రవారం పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, డాక్టర్ ఎం.తిప్పేస్వామి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్ సీపీ నాయకురాలు మధుమతిరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, టీటీడీ బోర్డు సభ్యుడు అశోక్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడారు. హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని గెలిపించి అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. 'పురం'పై వైఎస్సార్ సీపీ జెండా ఎగిరితే... అభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానన్నారు. చలివెందుల పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుడి విజయానికి కృషి చేసిన నాయకులందరినీ పేరుపేరునా అభినందిస్తున్నానన్నారు. ఇదే స్ఫూర్తితో అందరూ పనిచేస్తే రానున్న ఎన్నికల్లో పార్టీని విజేతగా నిలపాలన్నారు. కుప్పంలో కూడా ప్రజల సహకారంతో 90 శాతం సర్పంచ్ స్థానాలు, 98 శాతం ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాలు గెలిచామన్నారు. మున్సిపాలిటీ కూడా కైవసం చేసుకున్నామనీ, అదే స్ఫూర్తితో ఇక్కడా పనిచేసి విజయఢంకా మోగించాలన్నారు.

ఆదుకున్న వారికే అండగా నిలవాలి..

కరోనా కష్టకాలంలో హిందూపురం చాలా ఇబ్బందులు పడిందని, ఆ సమయంలో ప్రజలకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్యే బాలకృష్ణ హైదరాబాద్‌లో దాక్కుంటే...సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలా అండగా నిలిచారని మంత్రి పెద్దిరెడ్డి గుర్తుచేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సహాయ సహకారాలు అందించిన విషయం మరచిపోకూడదన్నారు. సొంత బిడ్డల్లా ఎందరికో సాయం చేస్తున్న వలంటీర్లపై కొందరు నాయకులు విషం చిమ్ముతున్నారని, వారికి తగిన గుణపాఠం చెప్పితీరాలన్నారు.



వైఎస్సార్ సీపీ కార్యాలయ ప్రారంభోత్సవ సభలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

జగన్ పాలనలోనే అన్నివర్గాల అభ్యున్నతి..

ఎంపీ గోరంట్ల మాధవ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ...ఇలా అన్ని వర్గాలకు రాజ్యాధికారం దక్కిందన్నారు. మహిళల కోసం అన్నిరంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. అలాగే వివిధ పథకాలతో అన్ని వర్గాలు అభ్యున్నతి సాధించాయన్నారు. పాలకుడు మంచివాడైతే ప్రకృతి కూడా సహకరిస్తుందని, అందువల్లే నాలుగేళ్లగా వరుణుడు సకాలంలో కరుణిస్తూ విస్తారంగా వర్షిస్తున్నాడన్నారు. ప్రస్తుతం రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని, అది కలకాలం ఇలాగే ఉండాలంటే అందరం వైఎస్ జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

విజయానికి పునాది పడింది..

పెనుకొండ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ మాట్లాడుతూ...సీఎం జగన్ జనరంజక పాలన, నేతల సమన్వయంతో హిందూపురంలో వైఎస్సార్ సీపీ విజయానికి నేడు పునాది పడిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. సీఎం జగన్ అనే పథకాలు ప్రవేశపెట్టి అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతుంటే కొందరికి నచ్చడం లేదని, అందుకే లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. గతంలో పెన్షన్, ఇళ్లు, చివరకు రేషన్ కార్డు కావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యులకు సలాం చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు అర్హత ఉంటే వలంటీర్లే వెతుక్కుంటూ వచ్చి పథకం వర్తించేలా చూస్తున్నారన్నారు. ఎలాంటి పాలన కావాలో తేల్చుకోవాలన్నారు.

విజయఢంకా మోగిద్దాం..

ఏపీ ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ మాట్లాడుతూ... అందరం ఏకమై రానున్న ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. రానున్న ఏడు నెలలు కార్యకర్తలంతా అవిశ్రాంతంగా పనిచేయాలన్నారు. నాయకులందరమూ కలిసి గడపగడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు, కలిగిన లబ్ధి వివరిస్తూ ప్రజల మద్దతు కోరుతామన్నారు. అప్పుడు నియోజకవర్గంలో పసుపు చొక్కా అనేది కనిపించదన్నారు.

విజయాన్ని జగనన్నకు కానుకగా ఇద్దాం..



పార్టీ కార్యాలయంలో పూజలు చేస్తున్న టీఎన్ దీపిక, వేణురెడ్డి దంపతులు

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మాట్లాడుతూ...రానున్న ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి జగనన్నకు కానుకగా ఇవ్వాలని నేతలు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశంలోనే ఎక్కడాలేనన్ని పథకాలు అమలుచేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు చేస్తున్నారని, అలాగే రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న మంచి పనులు చూసి ఓర్వలేని టీడీపీ నాయకులు ఇతర రాష్ట్రాల మేనిఫెస్టోను కాపీ కొట్టి అన్నీ ఉచితమంటూ మరోసారి మోసం చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ఎవరు ఎన్ని చేసినా జనమంతా జగనన్న వెంటే ఉన్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామన్నారు. గత ఎన్నికల్లో మిథున్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 12 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలు సాధించామని, ఇప్పుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మార్గదర్శకత్వంలో అదేరీతిలో కష్టపడి ఉమ్మడి అనంతపురం జిల్లాల్లో 14 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాలు గెలిచి వైఎస్సార్ సీపీ సత్తా చాటుదామన్నారు. సమావేశంలో నియోజవర్గ నాయకులు వేణురెడ్డి, బాబురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, మున్సిపల్ వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీపీలు పురుషోత్తంరెడ్డి, రత్నమ్మ, నియోజకవర్గ నాయకులు కొటిపి హనుమంతరెడ్డి, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు జనార్దన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాగమణి, జెడ్పీటీసీ సభ్యులు నాగభూషణం, శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

నాగపట్నం, మంత్రాలయానికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు



గుంతకల్లు: నాగపట్నం, మంత్రాలయం క్షేత్రాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనుంది. నాగపట్నం వెళ్లే భక్తుల కోసం గుంతకల్లు జంక్షన్ మీదుగా ఈ నెల 27, 29 తేదీల్లో ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నారు. బాంద్రా – వేలాంకణి (09047) ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు బాంద్రా జంక్షన్‌లో 27వ తేదీ ఉదయం 10.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 8.35 గంటలకు వేలాంకణి జంక్షన్‌కు చేరుతుంది. ఈ రైలు పుణే, డోండ్, షోలాపూర్, వాడీ, రాయచూర్, మంత్రాలయం, గుంతకల్లు, కడప, రేణిగుంట, కాట్పాడి, వేలూరు, తిరువూరు, నాగపట్నం మీదుగా వేలాంకణి జంక్షన్‌కు చేరుతుంది. ఇక వేలాంకణి – వడోదర మధ్య ప్రత్యేక రైలు (09048) వేలాంకణి జంక్షన్ నుంచి 29వ తేదీ సాయంత్రం 4.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 7.30 గంటలకు వడోదర జంక్షన్ చేరుతుంది. ఈ రైలు నాగపటం, తిరువూరు, వేల్పురం, వేలూరు, కాట్పాడి, రేణిగుంట, కడప, గుంతకల్లు, మంత్రాలయం, రాయచూర్, వాడీ, షోలాపూర్, డోండ్, పుణే, లోనవాల, సూరత్ మీదుగా వడోదర జంక్షన్‌కు చేరుతుంది.

మంత్రాలయం బ్రహ్మోత్సవాలకు...

మంత్రాలయం రాఘవేంద్రస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో మంత్రాలయం – మచిలీపట్నం మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపనున్నారు. మంత్రాలయం – మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు (07067) ప్రతి శని, మంగళ, గురువారాల్లో మంత్రాలయం జంక్షన్ నుంచి రాత్రి 8.00 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11.00 గంటలకు మచిలీపట్నం చేరుతుంది. మచిలీపట్నం – మంత్రాలయం మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు (07068) ప్రతి ఆది, బుధ, శుక్రవారాల్లో మచిలీపట్నం జంక్షన్ నుంచి మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.05 గంటలకు మంత్రాలయం చేరుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 31 నుంచి అక్టోబర్ 1 వరకు ఆయా రోజుల్లో మాత్రమే నడపనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రైళ్లు గుడివాడ, విజయవాడ, గుంటూరు, నరసరావుపేట, దొనకొండ, మార్కాపురం రోడ్డు, కంభం, గిద్దలూరు, డోన్, కర్నూలు, గద్వాల్, రాయచూర్ మీదుగా మంత్రాలయానికి రాకపోకలు సాగిస్తాయన్నారు.

టీటీడీ బోర్డు మెంబర్‌గా ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: ఎమ్మెల్యే డాక్టర్ ఎం. తిప్పేస్వామికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలక మండలిలో చోటు దక్కింది. మొత్తం 24 మందిని టీటీడీ బోర్డు సభ్యులుగా నియమిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. అందులో శ్రీసత్యసాయి జిల్లా నుంచి ఎమ్మెల్యే తిప్పేస్వామి కూడా ఉన్నారు. తొలిసారిగా మడకశిర నియోజకవర్గానికి చెందిన దళిత ఎమ్మెల్యేకి టీటీడీ బోర్డులో స్థానం దక్కడంపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనకు టీటీడీ బోర్డులో స్థానం కల్పించినందుకు ఎమ్మెల్యే తిప్పేస్వామి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటానని తెలిపారు. శ్రీవారికి సేవ చేసే భాగ్యం రావడం నిజంగా తన జీవితం ధన్యమైందని, ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు.



ఎమ్మెల్యే తిప్పేస్వామి



అశ్వర్థనాయక్

టీటీడీ బోర్డులో అశ్వర్థనాయక్‌కు చోటు

తిరుమల తిరుపతి దేవస్థానములు (టీటీడీ) పాలక మండలి సభ్యునిగా అనంతపురం వాసి, విశ్రాంత రైల్వే మేనేజర్ అశ్వర్థనాయక్‌కు చోటు దక్కింది. ఈయన నియామకంపై టీటీడీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. త్వరలో తిరుమలలో జరిగే కార్యక్రమంలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే

రొళ్ల: శ్రావణ శుక్రవారం సందర్భంగా రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి కరెన్సీ నోట్ల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టు వస్త్రాలు, వెండి, బంగారు ఆభరణాలతో కనిపించిన అమ్మవారిని చూసి భక్తులు తరించారు. అంతకుముందు శ్రావణ శుక్రవారం సందర్భంగా ఆలయంలో వరలక్ష్మీ వ్రతం ఘనంగా జరిగింది. అర్చకులు అమ్మవారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



రత్నగిరి కొల్హాపురి మహాలక్ష్మీదేవిని నగదుతో అలంకరించిన దృశ్యం

పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం



ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనితో పారిశ్రామికవేత్తల బృందం

- ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోని

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన పారిశ్రామిక పార్కులలో పరిశ్రమలు స్థాపించే వారికి తగిన సహకారం, ప్రోత్సాహం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) జోనల్ మేనేజర్ సోని తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ సైతం రూపొందించిందన్నారు. స్థలాల కేటాయింపుతో పాటు అనుమతులు కూడా వేగవంతంగా మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు. 80 మందితో కూడిన ఆల్ ఇండియా ఆర్యవైశ్య పారిశ్రామిక వేత్తల బృందం శుక్రవారం పుట్టపర్తిలోని కప్పలబండ వద్ద గల ఏపీఐఐసీ పార్కును సందర్శించింది. అనంతరం పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం చేరుకున్న పారిశ్రామికవేత్తల బృందంతో ఏపీఐఐసీ జెడ్‌ఎం సోని, అమెరికా తెలుగు సంఘం ఇండియా కోఆర్డినేటర్ సూర్యచంద్రారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీఐఐసీ జెడ్‌ఎం సోని మాట్లాడుతూ, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. జిల్లాలో అమ్మవారిపల్లి, గోల్లాపురం, హిందూపురం, మడకశిర, కప్పలబండ, కొటిపి తదితర ప్రాంతాలలో అభివృద్ధి చేసిన మేజర్, మైక్రో ఇండస్ట్రియల్ పార్కులు ఉన్నాయన్నారు. పారిశ్రామిక వేత్తలు కోరుకుంటే ఇతర ప్రాంతాల్లోనూ స్థలాలు అభివృద్ధి చేసి ఇస్తామన్నారు. అమెరికా తెలుగు సంఘం ఇండియా కోఆర్డినేటర్ సూర్యచంద్రారెడ్డి మాట్లాడుతూ... పరిశ్రమల స్థాపనకు జిల్లా ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో హైవే కనెక్టివిటీ సైతం పెరిగిందన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపించాలని కోరారు. కార్యక్రమంలో నల్లమాడ మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ అనుకూలం

పెనుకొండ రూరల్: పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంతో అనుకూలమని ఆల్ ఇండియా ఆర్యవైశ్య పారిశ్రామిక వేత్తల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన తెలంగాణ, ఒరిస్సా, కర్ణాటక రాష్ట్రాల పారిశ్రామికవేత్తలతో కలిసి 'కియా' ఇండియాను సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పారిశ్రామిక పాలసీలోనూ సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. ప్రభుత్వం మౌలిక వసతులను కల్పిస్తే పరిశ్రమలు స్థాపించేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఎంపీ గోరంట్ల మాధవ్ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. 'కియా'కు అనుకూలమైన పద్ధతిలో మ్యానిఫ్యాక్చరింగ్ యూనిట్లు స్థాపనకు సిద్ధంగా ఉన్నామన్నారు. అందులో భాగంగానే 'కియా'ను సందర్శించామన్నారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్ చైర్మన్ బాలకృష్ణ, సభ్యులు ప్రసాద్ తదితర పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లేపాక్షిని సందర్శించిన కలెక్టర్



నంది విగ్రహం వద్ద కలెక్టర్ అరుణ్‌బాబు

లేపాక్షి: ప్రసిద్ధి చెందిన లేపాక్షి నంది విగ్రహంతో పాటు జాతాయువు పక్షి విగ్రహాన్ని శుక్రవారం మధ్యాహ్నం కలెక్టర్ అరుణ్‌బాబు సందర్శించారు. పర్యాటక కేంద్రం అభివృద్ధి, జతాయువు పక్షి విశిష్టతను వచ్చే పర్యాటకులు వివరించాలన్నారు. అలాగే నంది విగ్రహం, జతాయువు పక్షి ప్రాంతాల్లో పరసరాలు పరిశుభ్రంగా ఉంచాలని టూరిజం శాఖ సిబ్బందిని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో అధ్యాపకుడి మృతి

పావగడ: వెంకటాపురం గ్రామానికి చెందిన అధ్యాపకుడు బాలాజీ(53) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు.. బాలాజీ కొరటగెరె లోని ఐటీఐ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేసేవాడు. తుమకూరులో నివాసముండే అతడు శుక్రవారం స్వగ్రామానికి బైక్‌పై వచ్చాడు. తిరుగు ప్రయాణంలో మధుగిరి తాలూకా నల్లక్కమ్మనహళ్లి సమీపంలోని బైక్‌పై నుంచి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

పేద విద్యార్థులకు వరం

- ఎన్‌ఎంఎంఎస్‌తో ప్రతిభ గల విద్యార్థులకు అండ
- ఏడాదికి రూ.12 వేల స్కాలర్‌షిప్
- 9 నుంచి 12వ తరగతి వరకు నాలుగేళ్ల పాటు ఆర్థిక సాయం
- 2023–24 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల



ప్రశాంతి నిలయం: ఆర్థికంగా వెనుకబడి, ప్రతిభ ఉన్న విద్యార్థులను ఆదుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పథకాన్ని అమలు చేస్తోంది. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఏటా ఉపకారవేతనాన్ని అందిస్తోంది. పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభ చాటిన విద్యార్థులను ఎంపిక చేస్తారు.

నెలకు రూ. వెయ్యి..

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12 వేలు స్కాలర్‌షిప్‌గా అందిస్తారు. 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు అంటే నాలుగేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందుతుంది. దీని వల్ల ఒక్కో విద్యార్థికి రూ. 48 వేలు లబ్ధి జరగనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆరేళ్లలో 1754 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. విభజన అనంతరం అనంతపురం జిల్లాలో 2022–23 సంవత్సరంలో 179 మంది విద్యార్థులు లబ్ధి పొందారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది. ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్ష రాసేందుకు అర్హులు. సెప్టెంబరు 15లోపు విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబరు 16లోగా ఫీజు చెల్లించాలి. దరఖాస్తు ఫారాలను సంబంధిత ప్రధానోపాధ్యాయులకు అందజేయాలి.

ఇవీ అర్హతలు..

- ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు పొందిన విద్యార్థులు పరీక్ష రాయడానికి అర్హులు. తుది ఎంపిక సమయం నాటికి ఎనిమిదో తరగతిలో 55 శాతం మార్కులు పొంది ఉండాలి.
- ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, హాస్టల్ వసతి లేని మోడల్ స్కూళ్లలో రెగ్యులర్ విధానంలో చదవుతుండాలి. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించకూడదు.
- జనరల్, బీసీ విద్యార్థులు పరీక్ష ఫీజు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంటుంది.

ఎంపిక విధానం ఇలా...

రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రస్థాయిలో రెండు పేపర్ల రాత పరీక్షలు నిర్వహిస్తారు. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్) పేపర్‌లో వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్, క్రిటికల్ థింకింగ్ నుంచి 90 ప్రశ్నలు–90 మార్కులకు ఉంటాయి. స్కాలాస్టిక్ అప్టిట్యూడ్ టెస్ట్ (శాట్) పేపర్‌లోనూ 90 ప్రశ్నలు – 90 మార్కులకు ఉంటాయి. 7, 8 తరగతుల స్థాయిలో బోధించిన సైన్స్, సోషల్, మ్యాథ్స్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో పేపరుకు 90 నిమిషాల సమయాన్ని కేటాయిస్తారు.

కనీస అర్హత మార్కులు..

రెండు పరీక్ష (మ్యాట్, శాట్)ల్లో సగటున జనరల్ అభ్యర్థులకు 40 శాతం (36) మార్కులు, ఎస్సీ/ఎస్టీ విద్యార్థులకు 32 శాతం (29)మార్కులను కనీస అర్హత మార్కులుగా నిర్ణయించారు. జిల్లాను యూనిట్‌గా తీసుకొని రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు కేటగిరీల వారీగా ఎస్సీ/ఎస్టీ/బీసీ/దివ్యాంగులకు రిజర్వేషన్ ప్రకారం అర్హత పొందిన విద్యార్థుల మెరిట్ లిస్ట్ తయారు చేస్తారు.

సంవత్సరం	పరీక్ష రాసిన వారు	ఎంపికైంది
2016-17	3924	338
2017-18	4433	335
2018-19	6572	340
2019-20	5880	356
2020-21	3338	354
2021-22	4998	351
2022-23	2596	179

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం



ఉద్యోగులకు సూచనలిస్తున్న జెడ్పీ సీఈఓ, జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మార్క్ పాలన అప్పుడే మొదలైంది. ఇన్‌చార్జ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా కేతన్‌గార్గ్ అదనపు బాధ్యతలు చేపట్టిన మూడ్రోజులకే ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. తన ఆధ్వర్యంలో శనివారం తొలి సమావేశం నిర్వహించనుండటంతో కేతన్‌గార్గ్ శుక్రవారం అంతా కార్యాలయంలోనే ఉండి ఏర్పాట్లు చేయించారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, జెడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులు, ఎంపీపీలకు వేర్వేరుగా సీట్ల వరుసలు కేటాయించి, స్టిక్కర్లు అతికించేలా చర్యలు తీసుకున్నారు. ఆ తరువాత జెడ్పీ ఉద్యోగులతో మాక్ సమావేశం నిర్వహించారు. ఒక్కో పనిని ఒక్కొక్కరికి అప్పగించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులందరూ హాజరవుతారని, ప్రోటోకాల్ కచ్చితంగా పాటించాలని ఉద్యోగులను ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ కుషాల్ జైన్, డిప్యూటీ సీఈఓ లలితా బాయి హాజరయ్యారు.

ఓటరు సర్వేపై జేసీ సమీక్ష



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ చేతన్

లేపాక్షి: స్థానిక వైకేపీ కార్యాలయంలో శుక్రవారం జాయింట్ కలెక్టర్, హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ ఆఫీసర్ టీఎస్.చేతన్ ఓటరు సర్వేపై హిందూపురం నియోజకవర్గంలోని ఏఈఆర్‌ఓఎస్, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. ఇంటింటి సర్వేను పకడ్బందీగా చేపట్టాలన్నారు. అలాగే ఓటర్ల మార్పులు చేర్పుల్లో తీసుకోవాల్సిన నిబంధనలను తెలిపారు. ఒకే డోర్ నంబర్‌పై ఎక్కువ ఓటరు కార్డులు ఉంటే వాటిని సమగ్రంగా పరిశీలించాలని సూచించారు.

అనంతరాజుపై సస్పెన్షన్ ఎత్తివేతకు నిర్ణయం



అనంతరాజు

మడకశిర: రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో శుక్రవారం హిందూపురంలో రొళ్ల జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు భేటీ అయ్యారు. ఈ భేటీలో ఎమ్మెల్యే తిప్పేస్వామి కూడా పాల్గొన్నారు. రొళ్ల జెడ్పీటీసీ అనంతరాజు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. అయితే జెడ్పీటీసీ ఎన్నికల్లో ఆయన పార్టీకి వ్యతిరేకంగా పోటీ చేయడంతో అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసింది. అయితే పార్టీ సస్పెండ్ చేసినా ఆయన ఏనాడు పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదు. ఈ నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురానికి పిలిపించుకొని ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో ఆయనతో చర్చలు జరిపారు. చర్చలు సఫలం కావడంతో అనంతరాజుపై సస్పెన్షన్ ఎత్తి వేయాలని జిల్లా అధ్యక్షుడు శంకర్‌నారాయణకు సూచించారు.

అర్హులకు న్యాయం చేయడమే లక్ష్యం

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



వైసీ తిమ్మారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి

మడకశిర: అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర గనులు, అటవీ, ఇంధనశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని వైబీ హళ్లి క్రాస్‌లో మాజీ ఎమ్మెల్యే, దివంగత వైసీ తిమ్మారెడ్డి విగ్రహావిష్కరణ చేశారు. తిమ్మారెడ్డి కుమారుడు మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో విగ్రహ దాతలు వెంకటస్వామి, కల్లప్పలను మంత్రి సన్మానించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ వైసీ తిమ్మారెడ్డి అనేక పదవులను అలంకరించి మడకశిర ప్రాంతంలో ప్రజలకు సేవలు అందించారని తెలిపారు. అదే తరహాలోనే వైఎస్ జగన్ కూడా పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని చెప్పారు. టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు పేదలను దోచుకున్నాయని ఆరోపించారు. ఈ ప్రాంతానికి వైసీ తిమ్మారెడ్డి అందించిన సేవలను మరువలేమని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. వైసీ తిమ్మారెడ్డి ఆదర్శప్రాయుడని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణ కొనియాడారు. టీటీడీ బోర్డు మెంబర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ విలువైన భూములు పాఠశాలలు, దేవాలయాలకు తిమ్మారెడ్డి దానం చేశారన్నారు. కదిరి ఎమ్మెల్యే సిద్దారెడ్డి, మాజీ మంత్రి నర్సేగౌడు, హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మధుమతి, జ్యోతిక, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది మెళవాయి గోవిందరెడ్డి, నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ పోస్టు భర్తీకి నోటిఫికేషన్

అనంతపురం: కేంద్ర రోడ్డు రవాణా మంత్రి శాఖ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ అనంతపురంలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహిస్తున్న బ్రిడ్జి అండ్ టన్నెల్స్ ప్రాజెక్ట్‌లో పనిచేయడానికి ఒక చైర్ ప్రొఫెసర్ పోస్టును భర్తీ చేస్తున్నారు. ఇందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ స్పెషలైజేషన్‌లో నిపుణులై, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి ఉండాలి. చైర్ ప్రొఫెసర్‌గా రెండు సంవత్సరాలు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. పని తీరు సమర్థవంతంగా ఉంటే గరిష్టంగా 5 సంవత్సరాల వరకు గడువును పొడిగిస్తారు. ఆగస్టు 1, 2022 నాటికి 62 సంవత్సరాల వయస్సు మించి ఉండకూడదు. రెసిడెన్షియల్ ప్రొఫెసర్‌గా ఉండాలి. బ్రిడ్జి అండ్ టన్నెల్స్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లర్నింగ్, జియో ఎలక్ట్రికల్ సిస్టమ్ కోర్సులను చైర్ ప్రొఫెసర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. బ్రిడ్జి అండ్ టన్నెల్స్ విభాగంలో ఎంటెక్ కోర్సు నిర్వహించాల్సి ఉంటుంది.

కవాతుతో నాయకత్వ లక్షణాలు

- ఎస్పీ మాధవరెడ్డి



పరేడ్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి టౌన్: పరేడ్ , స్పోర్ట్స్ మీటు పోలీసుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని ఎస్పీ మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏ.ఆర్ సాయుధ బలగాలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, హోంగార్డులు, పుట్టపర్తి అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉన్న పోలీస్ సిబ్బందికి పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించడంతో పాటు వారికి సలహాలు, సూచనలిచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ సిబ్బందికి ఏఆర్ విభాగం వెన్నముకలాంటిదన్నారు. ఏదైనా లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తినప్పుడు ఏఆర్ సిబ్బంది పాత్ర కీలకమవుతుందన్నారు. శారీరక దృఢత్వం విషయంలో సిబ్బంది శ్రద్ధ చూపాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. అనంతరం ఏఆర్ సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే శుక్రవారం గ్రీవెన్స్ కార్యక్రమంలో సమస్యలు తెలుపుకొంటే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఆర్‌ఐలు టైటస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గాడితప్పిన విద్యాశాఖ

- ఇష్టారాజ్యంగా నియామకాలు !
- పట్టనట్లు వ్యవహరిస్తున్న డీఈఓ

ప్రశాంతి నిలయం: విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా తీర్చిదిద్దాల్సిన విద్యావ్యవస్థ గాడి తప్పుతోంది. ధనార్జనే ధ్యేయంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తమకు నచ్చినచోటికి బదిలీలు చేసుకుంటున్న పరిస్థితి. జిల్లా కేంద్రానికి దగ్గరలోనే ఉండాలనే ఉద్దేశంతో ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నతాధికారులకు పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టజెప్పి దూర ప్రాంతాలకు వచ్చిన బదిలీ ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ సర్వ శిక్ష అభియాన్‌లో ప్రధాన స్థానాలను ఎంచుకున్నారు. ఈ వ్యవహారం వారం పది రోజులుగా ఆ నోట.. ఈ నోట నానుతున్నా.. జిల్లా విద్యాశాఖాధికారి పట్టనట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం. డీఈఓ కార్యాలయంలో పనిచేసే ఓ ప్రధాన ఉద్యోగి కీలకంగా వ్యవహరిస్తూ కలెక్టర్‌కు కూడా తెలియపరచకుండా అడ్డగోలుగా.. దొడ్డిదారిన వ్యవహారం చక్కబెడుతున్నారని తెలిసింది. కుదిరితే నేడో, రేపో అధికారికంగా ఉత్తర్వులు కూడా వెలువరించేందుకు రంగం సిద్ధం చేశారని సమాచారం.

దూర ప్రాంతాలకు వెళ్లకుండా..

జిల్లా కేంద్రంలో పని చేసే ముగ్గురు ఉద్యోగులను మడకశిర చుట్టుపక్కల ప్రాంతాలకు బదిలీ చేశారు. అంతదూరం వెళ్లేందుకు వారు అయిష్టత చూపడంతో పాటు ఉన్నతాధికారులకు పెద్ద మొత్తంలో నగదు ముట్టజెప్పి బదిలీలో మార్పులు చేసుకునే యత్నం చేశారు. ఇందులో భాగంగా సర్వ శిక్ష అభియాన్‌లో ఖాళీగా ఉన్న ఏఎస్‌ఓ (అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్), ఏపీఓ (అసిస్టెంట్ ప్రోగ్రామ్ ఆఫీసర్), అసిస్టెంట్ ఐఈడీ (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్) పోస్టులపై కన్నేశారు. డీఈఓ కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగి ఈ తతంగాన్ని గుట్టు చప్పుడు కాకుండా చేసే ప్రయత్నం చేస్తున్నారు. సమగ్ర శిక్ష కార్యాలయ సిబ్బందికి కూడా తెలియకుండా చాకచక్యంగా వ్యవహరిస్తున్నారు. ఏడు పోస్టులు ఖాళీ ఉండగా.. డబ్బులిచ్చిన ముగ్గురికి మాత్రమే స్థానాలు కేటాయిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

అలాంటిదేమీ లేదు : డీఈఓ

సర్వ శిక్ష అభియాన్‌లో అడ్డగోలుగా జరుగుతున్న అవకతవకలపై 'సాక్షి' డీఈఓ మీనాక్షిని వివరణ కోరగా.. అలాంటిదేమి లేదని, నిబంధనల మేరకే నియామకాలు చేపడతామని పేర్కొన్నారు.

సమ్మెలోకి సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు



సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్ వద్ద నిరసనకు దిగిన కార్మికులు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ డ్యాం వద్ద ఉన్న సత్యసాయి తాగునీటి ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కార్మికులు శుక్రవారం సమ్మెబాట పట్టారు. న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించలేదని ప్రాజెక్ట్ ముందు నిరసనకు దిగారు. కార్మిక సంఘ నేతలు త్రిలోకనాథ్, తిప్పయ్య, గోవింద్, సుంకన్న, శ్రీనివాసులు, రామచంద్ర మాట్లాడారు. 5 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 18 నెలల ఈఎస్ఐ , 8 నెలల పీఎఫ్ చెల్లించాలని, రెండేళ్ల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పరిష్కరించేంత వరకు ప్రాజెక్ట్ పరిధిలో పని చేసే కార్మికలెవరూ విధుల్లోకి చేరమన్నారు.

అమ్మను తిట్టాడని హత్య

- జువైనల్ హోంకు మైనర్

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: తాగిన మైకంలో తల్లిని తిట్టాడన్న కోపంతో రగిలిపోయిన బాలుడు చేతికందిన బీరు బాటిల్ పగులగొట్టి పొడవడంతో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. వన్ టౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన హత్యకు సంబంధించిన వివరాలను సీఐ రెడ్డెప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు కాలనీకి చెందిన వడ్డే గంగాధర్ ఈ నెల 19న తాగిన మైకంలో బోయగేరి ప్రాంతానికి వచ్చాడు. ఈ నేపథ్యంలోనే ఇంటి ముందు కూర్చుని ఉన్న రవి అనే బాలుడితో పాటు తన తల్లిని కూడా తిట్టాడు. దీంతో కోపోద్రిక్తుడైన బాలుడు చెత్తకుప్పలో లభించిన బీరు బాటిల్ తీసుకుని గంగాధర్ తలపై మోదడంతో పాటు గాజు ముక్కతో గొంతుపై పడిచాడు. స్థానికులు గుర్తించి అతన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న గంగాధర్ చనిపోయాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఈ కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు ఎట్టకేలకు బోయగేరికి చెందిన బాలుడిని అదుపులోకి తీసుకొని ఆరా తీయగా జరిగిన విషయాన్ని బాలుడు ఒప్పుకున్నాడు. దీంతో బాలుడిని జువైనల్ హోంకు తరలించామన్నారు.

హెచ్చెల్సీలో ఒకరి మృతి

- మరొకరి గల్లంతు
- వేర్వేరు ప్రాంతాల్లో ఘటనలు



నవాజ్ (ఫైల్)



మల్లికార్జున (ఫైల్)

బొమ్మనహాళ్: హెచ్చెల్సీలో గల్లంతై ఒకరు మృతి చెందగా.. గల్లంతైన మరొకరి కోసం పోలీసులు, బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. వేర్వేరు ప్రాంతాల్లో ఈ ఘటనలు చోటు చేసుకున్నాయి. బళ్లారిలోని హెచ్చెల్సీ కాలువలో సరదాగా ఈత కోసం వెళ్లిన ఓ బాలుడు గురువారం గల్లంతయ్యాడు. శుక్రవారం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు వద్ద శవమై తేలాడు. బళ్లారి రూరల్ ఏఎస్ఐ హనుమంతప్ప వివరాల మేరకు.. బళ్లారి పట్టణంలోని మిల్లర్ పేటకు చెందిన సాజిదాబాను, దాదాపీర్ దంపతులకు నవాజ్ (16) అనే కుమారుడు ఉన్నాడు. పట్టణంలోని గుగ్గిరెట్టిలో నివాసం ఉంటున్న తన స్నేహితుడు ఫరూక్‌తో కలిసి గుగ్గిరెట్టి సమీపంలోని హెచ్చెల్సీ కాలువలో ఈతకోసం వెళ్లారు. ఈత కొడుతున్న నవాజ్ ప్రమాదవశాత్తూ గల్లంతు కావడంతో ఫరూక్ వెంటనే బళ్లారి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. శుక్రవారం మధ్యాహ్నం మండలంలోని ఉంతకల్లు శివారులోని హెచ్చెల్సీ కాలువలో శవమై తేలాడు. బళ్లారి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతుని తండ్రి దాదాపీరాకు గత కొంతకాలంగా పక్షవాతం వచ్చి ఇంట్లోనే ఉంటున్నాడని, మృతుడు నవాజ్ టైల్స్ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడన్నారు. ఉన్న ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడటంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

రాయంపల్లి దగ్గర...

ఉరవకొండ: మండల పరిధిలోని రాయంపల్లి వద్ద ఉన్న హెచ్చెల్సీ కాలువలో శుక్రవారం అదే గ్రామానికి చెందిన మల్లికార్జున (37) అనే రైతు ప్రమాదవశాత్తూ కాలు జారి గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యుల వివరాలమేరకు... హెచ్చెల్సీ కింద మల్లికార్జున 2 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. తన పొలానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి వైరు తీసుకెళుతుండగా కాలు జారి కాలువలో పడ్డాడు. హెచ్చెల్సీలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గల్లంతయ్యాడు. తోటి రైతులు, కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగానే గాలింపు చర్యలు చేపట్టారు. మల్లికార్జునకు భార్యతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు.